సాక్షి రంగారెడ్డి

గురువారం ; 9 ; జనవరి ; 2025



అవగాహన అవసరం

రోడ్డు భద్రతా నియమాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. 8లో▸



ప్రైవేట్‌శక్తులకు ప్రజా సంపద

కేంద్రం ప్రజా సంపదను ప్రైవేట్ శక్తులకు కట్టబెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. 8లో▸



నక్ష రోడ్డు కబ్జా

నక్ష రోడు కబ్జాచేసిన రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని చిన్నషాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఔత్సాహిక విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనుందని తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించాలని భావించిన బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కుల ధ్రువీకరణ పత్రం నంబర్, ఆదాయ ధ్రువీకరణ పత్రం నంబర్, ఆధార్ కార్డు నంబర్, బర్త్ సర్టిఫికెట్, ఫొటో అవసరమని తెలిపారు. ఆయా ధృవీకరణ పత్రాల జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమావేశంపై వాగ్వాదం



కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో అధికారులు చేపట్టిన సమావేశం విషయమై అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం లేమూరు రెవెన్యూ పరిధిలో ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో భూసేకరణ విషయమై చర్చించడానికి ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు ఆధ్వర్యంలో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న లేమూరు రైతులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని రైతులకు సమాచారం ఇవ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆర్డీఓ మరోసారి భూములు కోల్పోతున్న రైతులతో సమావేశమవుదామని చెప్పి అక్కడి నుంచి అందరినీ పంపించి వేశారు.

మరకత శివాలయం మహాద్భుతం



నిఖిల్ చంద్ర, అనంత శ్రీరామ్ తదితరులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చెందిప్ప గ్రామంలో వెలసిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఏదో తెలియని మహిమ దాగుందని కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప మనుమడు, అమేయ గ్రేగ్ గ్రూప్ అధినేత నిఖిల్ చంద్ర ముళ్లపూడి, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, సినీ నటి కారుణ్య చౌదరి అన్నారు. బుధవారం వారు ఆలయాన్ని దర్శించారు. లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ దేవాలయ ప్రాముఖ్యత, విశిష్టత గురించి ఎంతో మంది చెప్పారని.. ఈరోజు ప్రత్యక్షంగా దర్శించుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆలయంలో ఏదో అద్భుత శక్తి దాగి ఉన్నట్లు అనిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించి, మరకత శివాలయ పటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ శేఖర్, సభ్యులు హనుమంతు, మాజీ సర్పంచి శ్రీనివాస్, అర్చకుడు శివ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


భగవద్గీత కంఠస్థ పోటీల్లో గోల్డ్‌మెడల్



సాయి సుప్రీత్‌కు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

షాబాద్: బెంగళూరు శ్రీ దత్తపీఠం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో షాబాద్ ధ్యానహిత పాఠశాలకు చెందిన సాయి సుప్రీత్ బంగారు బహుమతి గెలుచుకున్నారు. విజయవాడలో గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా సాయి సుప్రీత ఈ బంగారు పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సుప్రీత్‌ను, తల్లిదండ్రులను అభినందించింది.

జల ఘంటికలు!



భూగర్భ జలాలు పాతాళంలోకి..

- వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవా?
- పెరిగిన గృహావసరాల వినియోగం
- ట్యాంకర్లకు భారీగా డిమాండ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి పొంచి ఉందా? అనే ప్రశ్నకు ఔననే సమాధానం వస్తోంది. పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు క్రమంగా పడిపోతున్నాయి. పక్షం రోజుల పరిధిలో అర మీటరు నుంచి మీటరుకు పైగా నీటి మట్టాలు అడుగంటడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వాస్తవంగా గతేడాది కంటే పరిస్థితి కొద్దిగా మెరుగ్గా ఉన్న నగరంలోని కోర్‌సిటీతో పాటు శివారు, ఓఆర్‌ఆర్ లోపల మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని అర్బన్ పరిధిలో మాత్రం భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. వేసవి నాటికి నీటి సమస్య మరింత పెరిగే అవకాశాలున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

ఇంకినవి ఇంకినట్టే తోడేస్తున్నారు..

గ్రేటర్ పరిధిలో గోదావరి, కృష్ణా, మంజీరా నదుల నుంచి ఉపరితల జలాలు సరఫరా అవుతున్నప్పటికీ.. ఇంటి అవసరాల కోసం భూగర్భ జలాలను విపరీతంగా ఉపయోగించుకున్నారు. భూమిలోకి ఇంకిన నీరు ఇంకినట్లే తోడేస్తుండటంతో భూగర్భ జలాలు పాతాళంలోకి పడిపోతున్నాయి. రెండేళ్ల క్రితం నేలలోకి ఇంకిన నీటి పరిమాణం, తోడివేతపై అధికారిక నివేదిక పరిశీలిస్తే.. తక్కువ నీరు ఇంకి, ఎక్కువ నీరు తోడిన ప్రాంతాల్లో హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలు మొదటి స్థానాల్లో నిలిచాయి. గతేడాది అతి తక్కువ నీరు ఇంకి, ఎక్కువ వినియోగించడంతో వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి తప్పలేదు. హైదరాబాద్ జిల్లాలో 5,808 కోట్ల లీటర్ల నీరు ఇంకగా 5,438 కోట్ల లీటర్లను ఉపయోగించుకున్నారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 8,879 కోట్ల లీటర్ల నీరు ఇంకగా, 5,296 కోట్ల లీటర్లు తోడేశారని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

లోలోతుల్లోకి..

మహా నగర పరిధిలో భూగర్భ జల మట్టాలు గతేడాది కంటే పడిపోయినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నగరంతో పాటు శివారులోని రంగారెడ్డి జిల్లా అర్బన్ పరిధిలో మాత్రం 0.4 మీటర్లు భూగర్భజలాలు పడిపోయాయి. కేవలం నవంబర్ నుంచి పోలిస్తే డిసెంబర్ చివరి నాటికి హైదరాబాద్‌లో 0.47 మీటర్ల భూగర్భ జలమట్టాలు తగ్గగా, మేడ్చల్–మల్కాజిగిరి పరిధిలో 1.08 మీటర్లు అడుగంటాయి. హైదరాబాద్‌లో సాధారణం కంటే డిసెంబర్‌లో 18 శాతం అధిక వర్షపాతం నమోదైనా, ఆ మేరకు భూగర్భ జలాలు పెరగడం లేదు. శివారు పరిధిలోని శేరిలింగంపల్లి, మణికొండ, హయత్‌నగర్, సరూర్‌నగర్, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో బోర్లు నుంచి నీరు తగ్గుముఖం పట్టాయి.

ట్యాంకర్లకు పెరిగిన తాకిడి

వేసవికి ముందే ట్యాంకర్ల డిమాండ్ తారస్థాయికి చేరుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తక్కువ లోతులో ఉన్న బోర్లలో నీరు రావడం లేదు. ఫలితంగా నీటి ట్యాంకులకు డిమాండ్ పెరిగిపోతోంది. జలమండలి పైపులైన్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా చేసే నీటి పరిమాణంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేది తక్కువే అయినా దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తాగునీటికి పూర్తిగా జలమండలిపైనే ఆధారపడిన ప్రాంతాల్లో ట్యాంకర్లు వెళ్లకపోయినా, జాప్యం జరిగినా తీవ్ర ప్రభావం చూపుతోంది.

ప్రస్తుతం భూగర్భ జల మట్టాలు ఇలా (మీటర్లలో)..

జిల్లా	భూగర్భజల మట్టం– 2024	భూగర్భజల మట్టం–2023
హైదరాబాద్	7.32	7.57
రంగారెడ్డి జిల్లా	9.08	8.68
మేడ్చల్–మల్కాజిగిరి	10.35	9.24
మారేడుపల్లి	12.95	10.16
సైదాబాద్	9.90	5.23
ఖైరతాబాద్	7.86	6.06
హస్మత్‌పేట	10.3	8.52
ఇబ్రహీంపట్నం	14.11	12.37



❖ సర్వర్ డౌన్.. పరేషాన్

ధరణి రిజిస్ట్రేషన్లకు సర్వర్ డౌన్ సమస్యగా మారింది. రిజిస్ట్రేషన్లకోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేవారికి పడిగాపులు తప్పడం లేదు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం 30 రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. ఉదయం నుంచి సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లు కాలేదు. సాయంత్రం నాలుగు గంటల వరకు నాలుగు మాత్రమే అయ్యాయి. మిగిలినవారంతా రిజిస్ట్రేషన్లకోసం అక్కడే వేచి ఉన్నారు. నాలుగైదు రోజుల నుంచి ఇదే సమస్య ఎదురవుతోందని రైతులు వాపోయారు. – మొయినాబాద్

రహదారులతోనే అభివృద్ధి



చేవెళ్లలో పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, రంజిత్‌రెడ్డి తదితరులు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- చేవెళ్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చేవెళ్ల: రహదారులు అభివృద్ధికి సూచికలు అని రోడ్లు భవనాలు, సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో రూ.38 లక్షలతో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం గోదాం, సొంత నిధులు రూ.40 లక్షలతో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి నిర్మించి పీఏసీఎస్ భవనం ప్రారంభం, ముడిమ్యాల వద్ద ముడిమ్యాల నుంచి రావులపల్లి, మేడిపల్లి మీదుగా ప్రొద్దటూరు గేట్ వద్దకు ఆర్‌అండ్‌బీ నిధులు రూ.24 కోట్లతో బీటీరోడ్డుకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. చేవెళ్ల అంటే హైదరాబాద్‌లో భాగమే అని, ఈ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పనులను వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మొదలు పెట్టించి ఏడాదిలోపు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదాల నివారణకు ఉమ్మడిజిల్లాలో రోడ్ల అభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామని స్పష్టం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే దాదాపు రూ.54వేల కోట్లు వ్యవసాయ రంగం కోసం కేటాయించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తూ అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, డీసీసీ మాజీ అధ్యక్షుడు పి.వెంకటస్వామి, టీపీసీసీ నాయకుడు జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డి. వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, వసంతం, సురేందర్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, దర్శన్, ఆగిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, ప్రభాకర్, శైలజ, సరిత, సమత, స్వరూప, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించండి..



విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

- సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సింహారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఒత్తిడిని జయించి, మంచి ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సింహారెడ్డి సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయన్నారు. లక్ష్య సాధనకోసం ప్రణాళికలు రూపొందించుకొని నిరంతరం శ్రమించాలని అన్నారు. విద్యావ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ సుశీందర్ రావు, ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటు వద్దు

మొయినాబాద్: మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని ఆయా గ్రామాల నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్‌కు విన్నవించారు. ఈ మేరకు బుధవారం వారిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, ముర్తూజగూడ గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా చేస్తున్నట్లు ప్రతిపాదించారని.. పూర్తిగా గ్రామీణ ప్రాంతంగా ఉన్న పంచాయతీలను మున్సిపాలిటీగా చేయడంతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 111 జీఓ అమలులో ఉన్న ఈ ప్రాంతాన్ని మున్సిపాలిటీగా చేయొద్దని కోరారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు గరుగు రాజు, అశోక్‌యాదవ్, జకరయ్య, రాములు తదితరులు ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ సర్వేపై ఆందోళన



సాకిబండతండాలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఆమనగల్లు: ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి ఫోర్త్‌సిటీ మీదుగా ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి వద్ద మంగళవారం సర్వేను రైతులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే కోసం ఆర్‌వీ కన్సల్టెన్సీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు బుధవారం మున్సిపల్ పరిధిలోని సాకిబండతండాకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక గిరిజన రైతులు అడ్డుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ భూముల్లో సర్వే చేసే అధికారం ఎవరిచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో ఉన్నకొద్దిపాటి భూమి పోతే ఎలా బతుకుతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తిరిగి వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. గిరిజనులకు ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ మద్దతు పలికారు. ఆందోళన చేస్తున్నవారికి సీఐ ప్రమోద్‌కుమార్ నచ్చజెప్పినప్పటికీ వినిపించుకోలేదు. చివరికి సర్వే చేయకుండానే సిబ్బంది, అధికారులు వెనుతిరిగారు.

అన్మాస్‌పల్లి, ముద్విన్ పరిధిలో మార్కింగ్..

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి, ముద్విన్ రెవెన్యూ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మార్కింగ్ సర్వే బుధవారం సజావుగా కొనసాగింది. ఆర్‌వీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. 330 అడుగుల రోడ్డు నిర్మాణానికి కడ్తాల్ రెవెన్యూ పరిధిలోని అన్మాస్‌పల్లిలో సుమారు రెండు కిలోమీటర్లు, ముద్విన్ రెవెన్యూ పరిధిలో 4 కిలోమీటర్ల వరకు సర్వే నిర్వహించి మార్కింగ్ వేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రాజు, వహీద్, సర్వేయర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో చెరువుల సర్వే

- ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మి మోసపోవద్దు
- ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న వారి జోలికి వెళ్లబోం
- నిబంధనల ప్రకారం నడుచుకుంటాం
- మాసబ్ చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



మాసబ్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

తుర్కయంజాల్: పూర్తిగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చెరువులను సర్వే చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఐఐటీ, బిట్స్‌పిలానీ సభ్యులతో కమిటీ వేసి చెరువుల హద్దులను ముందుగా నిర్ణయిస్తామని వెల్లడించారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని మాసబ్ చెరువు, జిలావర్‌ఖాన్ చెరువులను బుధవారం ఆయన అధికార బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మకూడదని సూచించారు. ఎవరో ఒకరికి సాయం చేయడం కోసం మరొకరిని బలిచేయబోమన్నారు. ఏది ఉన్నా నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని పేర్కొన్నారు. అమీన్‌పూర్, నల్లగండ్లలో చెరువులు ఉండాల్సిన దానికంటే ఎక్కువగా విస్తరించి ఉన్నాయనే ఫిర్యాదులు వచ్చాయని, అదే తరహాలో మాసబ్ చెరువుపై కూడా వాదనలు వినిపిస్తున్నాయని చెప్పారు. మూడు, నాలుగు నెలల్లో మాసబ్ చెరువును పూర్తిగా సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేస్తామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల నిర్ధారణ తరువాత ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని, ప్రజల నుంచి వినతులు, అభ్యంతరాలు స్వీకరిస్తామని ఆయన వివరించారు.

అలుగును సర్వే చేస్తాం

రంగనాథ్ ముందుగా తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 205లోని 12 ఎకరాల భూమిలో మట్టి డంప్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. దీనిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదే సమయంలో భూ యజమానులు వచ్చి తమకు న్యాయం చేయాలని కోరగా చెరువును పూర్తిగా సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. అనంతరం ఆదిత్యానగర్‌లో ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. ఉన్న ఆస్తులు అమ్మి రూ.లక్షలు పెట్టి ప్లాట్లను కొనుగోలు చేసి, ఇళ్లు కట్టుకున్నామని.. ప్రభుత్వం తమ జోలికి రావద్దని పలువురు మహిళలు ఆయనకు విన్నవించారు. హైడ్రా అనేది కేవలం భూ కబ్జాదారుల మీద పడేది మాత్రమేనని, ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న అమాయకుల జోలికి వెళ్లబోమని ఆయన స్పష్టం చేశారు. చెరువులు మురుగు నీరు చేరుతుండడం చూసి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి సూచించారు. అలుగు ఎత్తు పెంచడంతో తమ ఇళ్లు, పొలాలు మునుగుతున్నాయని పలువురు రైతులు వాపోయారు. అలుగును సర్వే చేస్తామని, తూములను కేవలం వ్యవసాయ పొలాలకు నీరు అందించడానికి ఏర్పాటు చేసినవి మాత్రమేనని చెప్పారు.

ఆ మట్టిని తొలగిస్తాం

చెరువు శిఖం సర్వే నంబర్ 137లో రోడ్డు వేయడానికి డంప్ చేసిన మట్టి, బండరాళ్లను తొలగిస్తామని రంగనాథ్ వెల్లడించారు. ఇలానే వదిలేస్తే బఫర్ జోన్ బయట ఉన్న వారికి కూడా ప్రమాదం పొంచి ఉంటుందని, వెంటనే మధ్య మధ్యలో రోడ్డును తవ్వి నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు వేయడానికి ప్రయత్నించిన వారెవరు, దీంతో ఎవరికి ప్రయోజనం చేకూరనుంది అనే దానిపై ఆరా తీశారు. బఫర్ జోన్ దాటి రోడ్డు వేసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తర్వాత ఆయన ఇంజాపూర్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద జిలావర్‌ఖాన్ చెరువులోకి నీరు వెళ్లే కాలువను పరిశీలించారు. జిలావర్‌ఖాన్ చెరువు గతంలో 30 ఎకరాలకే నోటిఫికేషన్ ఇచ్చారని, ప్రస్తుతం 130కి పైగా ఎకరాల్లో విస్తరించి ఉందని అధికారులు వివరించారు.

సురేంద్రరావు దుస్తకర్‌కు డాక్టరేట్



ఇబ్రహీంపట్నం రూరల్: గురు నానక్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సురేంద్రరావు దుస్తకర్‌ను డాక్టరేట్ వరించింది. విజయవాడలోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్(కేఎల్ డీమ్డ్ వర్సిటీ) లో డీప్ లెర్నింగ్ సాయంతో డెప్త్ డేటా అసిస్ట్ హ్యూమన్ యాక్షన్ రికగ్నిషన్ అనే అంశంపై డీఎస్‌రావు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ వి.భాగ్యరాజు మార్గదర్శకత్వంలో పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం దుస్తకర్‌ను అభినందించారు.

PUBLIC CAUTION NOTICE

The General Public are hereby informed and cautioned that my client M/s. ASN INDIA INFRA PRIVATE LIMITED, having its registered office at Flat No. 304, Aparna Green Apartments, Serilingampally, Gachibowli, K.V Rangareddy, Telangana - 500032, represented by its Managing Director SRI. A. SATYANARAYANA, S/o. A. YADAIAH is planning to purchase the following property and paid substantial amount as advance and earnest money:

Agricultural dry land to an extent of Ac.4.27Gts in Sy. No. 14/A/1/1, 14/A/2, 14/A/1/2, Burgul Village, Farooqnagar Mandal, Rangareddy District, Telangana bounded by North: Land of B.N.K. Raju, South: Land of Vijay and Land in Sy. No.14 Part, East: Land In Sy. Nos. 12, 13 and Road. West: Chikamam to Burgula BT Road from

1. SRI. CHINNAIAH GARIK CHRISTOPHER, S/o. LATE C. J KRUPADANAM, residing at No. 8-3- 228/214, Rahmath Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045
2. SRI. CHINNAYYAGARI VIJAY KUMAR, S/o. ESOPH, residing at No.2-58, Burgula Farooqnagar Mandal Rangareddy Dist Telangana - 509202.
3. SRI. CINAIAHGARI AKTHAR S/o. DEVID, residing at No.2-100/1, Ghanpur, Varni Mandal, Nizamabad, Telangana - 503206.

Therefore the General Public, Family Members of Land Owners, Banks, Financial Institutions, etc. are hereby informed and cautioned that, if they are having any claim, title, right, interest, charge or any of its kind whatsoever in and over the above mentioned properties, they are requested to contact the undersigned along with all relevant original documents within 15 (Fifteen) days from the date of this Public Caution Notice, failing which my client will proceed further and complete the sale transaction in its Favour or its nominee's favour and if any claims & objections thereafter will not be entertained.

Place: Hyderabad, Date: 08/01/2025

Sd/- M.A.Toufeeq Ahmed, Advocate,
5th Floor, Sai Plaza, Above Lenskart,
Opp. Metro Pillar No.678, JNTU-MIYAPUR Main Road,
Hydernagar, Hyderabad - 500072. Mobile No.8555952961

అదృశ్యమైన వృద్ధుడు.. అస్థిపంజరంలా లభ్యం

- ఆదిబట్ల ఠాణాలో మూడు నెలల క్రితం మిస్సింగ్ కేసు
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు



యంజాల లక్ష్మయ్య(ఫైల్)



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: కుళ్లిన స్థితిలో అస్థిపంజరం లభ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లి రెవెన్యూ బొంగర్లూరు సమీపంలోని అటవీప్రాంతంలో ఓ అస్తపంజరం, పుర్రెను గుర్తించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీంతో కలిసి ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు తెల్ల దోతి, షర్ట్ ధరించాడని.. చేతికి నల్ల దూరం ఉన్నట్లు గమనించారు. మూడు నెలల క్రితం ఎంపీ పటేల్‌గూడకు చెందిన వృద్ధుడు తప్పిపోయాడని కేసు నమోదు అయింది. అనుమానంతో వారి కుటుంబ సభ్యులను రప్పించి పరిశీలించగా యంజాల లక్ష్మయ్య(70)గా గుర్తించారు. గతంలోనూ ఇంట్లోంచి వెళ్లి తిరిగి వచ్చాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తప్పిపోయిన వృద్ధుడు లక్ష్మయ్య అస్థిపంజరంగా కనిపించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆస్పత్రికి వెళ్తూ.. అనంత లోకాలకు

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్
- తల్లీ,కూతుళ్ల దుర్మరణం
- తండ్రికి తీవ్ర గాయాలు

పహాడీషరీఫ్: అనారోగ్యంతో ఉన్న కూతురుకు చికిత్స చేయించేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్లు చివరకు అదే ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం విగతజీవులుగా వెళ్లాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాసిపల్లికి చెందిన చిత్తారి గోపాల్(36), లక్ష్మమ్మ(34) దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం. వీరి పెద్ద కూతురు విజయ(14)కు రక్తకణాలు తక్కువగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఉదయం 7.30గంటలకు వారిబైక్‌పై హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి బయలుదేరారు. ఉదయం 9.45గంటల సమయంలో తుక్కుగూడ ఓఆర్ఆర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే వెనుక ఉంచి వస్తున్న టిప్పర్ డ్రైవర్ ఒక్కసారిగా శంషాబాద్ టోల్ వైపునకు వాహనాన్ని మళ్లించాడు. ఈ క్రమంలో టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో పడిపోయిన లక్ష్మమ్మ, విజయ తల మీదుగా లారీ వెనుక చక్రాలు వెళ్లడంతో తల్లీకూతురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గోపాల్ కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారు.



లక్ష్మమ్మ, విజయ (ఫైల్)

తల్లీకొడుకుపై వీధి కుక్కల దాడి

కొందుర్గు: వీధికుక్కల దాడిలో తల్లీకొడుకులు గాయపడ్డారు. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం గోవులబండ తండాలో బుధవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన ఐదేళ్ల బాలుడు అఖిల్ సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఓ కుక్క దాడి చేసి గాయపరిచింది. గమనించిన బాలుడి తల్లి అంబిక అఖిల్ రక్షించేందుకు యత్నించగా ఆమె పైన సైతం కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



కుక్కల దాడిలో గాయపడిన అంబిక



బాలుడు అఖిల్

నక్ష రోడ్డు కబ్జా

రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మొయినాబాద్: రెండు గ్రామాల మధ్య ఉన్న నక్ష రోడ్డు, హరితహారంలో నాటిన మొక్కలను తొలగించి కబ్జాచేసిన రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని చిన్నషాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దమంగళారం పంచాయతీకి అనుబంధ గ్రామమైన చిన్నషాపూర్ నుంచి అమీర్‌గూడ మీదుగా మొయినాబాద్ వరకు నక్ష రోడ్డు ఉందని.. పెద్దమంగళారం రెవెన్యూలోని సర్వేనెంబర్ 370, 371, 372లో నుంచి ఉన్న నక్ష రోడ్డును ప్రీమియర్ కాసా బ్లాంక్ లేఅవుట్ చేసిన రియల్ వ్యాపారి కబ్జాచేశారని ఆరోపించారు. నక్షరోడ్డుకు ఇరుపక్కల నాటిన హరితహారం మొక్కలను సైతం జేసీబీతో తొలగించారని చెప్పారు. ఈ నక్ష రోడ్డును కబ్జా చేయడంతో చిన్నషాపూర్-అమీర్‌గూడ గ్రామాల మధ్య రాకపోకలకు, రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కబ్జాకు గురైన నక్షరోడ్డును కాపాడి.. కబ్జాచేసిన రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రవీణ్‌గౌడ్, నరేందర్, కృష్ణారెడ్డి, మాధవగౌడ్, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిన్నషాపూర్ గ్రామస్తులు

భార్యను చంపిన భర్తకు యావజ్జీవం



నర్సింహ (ఫైల్)

మహేశ్వరం: భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదుతో పాటుగా రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా అడిషనల్ కోర్టు తీర్పునిచ్చింది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన అల్వాల నర్సింహకు మహేశ్వరం మండలం మాణిక్యమ్మగూడ గ్రామానికి చెందిన జెన్నపల్లి మంగమ్మతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులుండగా మహేశ్వరం హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. మంగమ్మ జీవనోపాధి కోసం మాణిక్యమ్మగూడలో జెన్నపల్లి యాదయ్య ఇంట్లో అద్దెకుంటోంది. దంపతులు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో 2021 నవంబర్ 29న అద్దె ఇంట్లో భార్య మంగమ్మ మెడకు వైర్‌తో ఉచ్చు బిగించి హత్య చేశాడు. మృతురాలి తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు మహేశ్వరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి రంగారెడ్డి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. ఈ మేరకు వాదనలు విన్న మెజిస్ట్రేట్ అల్వాల నర్సింహకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు.

బొలేరోను ఢీకొట్టిన కారు

ఎనిమిది మందికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: బొలేరో వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామానికి చెందిన మహిళా కూలీలు బుధవారం ఉదయం బొలేరో వాహనంలో భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో కూలీ పనిచేసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో సంస్థ సమీపంలోకి రాగానే చెరువు మూలమలుపు వద్ద డ్రైవర్ దొరగండ్ల బాలకృష్ణ వాహన వేగాన్ని తగ్గించి గేట్ లోపలికి వెళ్తుండగా... వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి బొలేరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలు దొరగండ్ల పారిజాత, కాటమోని యాదమ్మ, గుండ్ల స్వరూప, బుద్దుల లక్ష్మి, ఓర్పు రజని, గుండ్ల కమలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న నాగోల్‌లోని స్నేహపురి కాలనీకి చెందిన గుమ్మడి వంశీ, గుమ్మడి శశిధర్‌కు తల, ఛాతిలో గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మహిళా కూలీలను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యాజ్యోతి కళాశాలలో రూ.15.24 లక్షలు చోరీ

మొయినాబాద్: ఇంజనీరింగ్ కళాశాల ఆఫీస్‌రూం కిటికీలో నుంచి గుర్తు తెలియని దుండగుడు చొరబడి చోరీకి పాల్పడ్డాడు. లాకర్‌లో ఉన్న రూ.15.24లక్షలు దోచుకెళ్లాడు. ఈ సంఘటన మండల పరిధి అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆఫీస్‌రూంలోకి మంగళవారం రాత్రి ఓ గుర్తుతెలియని దుండుగుడు కిటికీ గ్రిల్‌ను తొలగించి లోపలికి దూరాడు. ఆఫీస్‌లో ఉన్న తాళంచెవితో లాకర్ ఓపెన్ చేసి రూ.15.24 లక్షలు దోచుకుని వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కళాశాలకు వచ్చిన సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొయినాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకని పరిశీలించారు. క్లూస్‌టీం, సీసీఎస్ పోలీసులను రప్పించి వేలిముద్రలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించి దుండగుడిని గుర్తించే ప్రయత్నం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కళాశాలలే టార్గెట్‌గా...

ఇంజనీరింగ్ కళాశాలలే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. మండల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం చిలుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన చోరీలో గుర్తుతెలియని దుండగుడు కళాశాల ఆఫీస్ గదిలోకి చొరబడి రూ.8 లక్షలు ఎత్తుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినా ఇంతవరకు దొంగను పట్టుకోలేదు.

ముగ్గురు బాల కార్మికులకు విముక్తి

యాచారం: వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులకు యాచారం పోలీసులు బుధవారం విముక్తి కల్పించారు. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. బాలల హక్కుల పరిరక్షణ విభాగం అధికారి ప్రవీణ్, పోలీసులు సంయుక్తంగా యాచారం, మాల్ కేంద్రాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు. యాచారం, మాల్‌లో బైక్ పాయింట్‌లలో ఇద్దరు. స్టీల్ దుకాణంలో పని చేస్తున్న మరో బాలుడికి విముక్తి కల్పించినట్లు తెలిపారు. బాలకార్మికులను చట్ట విరుద్ధంగా పనులు చేసుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

తాటి చెట్టు పై నుంచి పడి..

గీత కార్మికుడి దుర్మరణం



వెంకటయ్య (ఫైల్)

కడ్తాల్: తాటి చెట్టుపై నుంచి జారిపడి ఓ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కట్ట వెంకటయ్య(45) గీత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని పొలంలో తాటి చెట్టుకు కల్లు గీయడానికి ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడ్డాడు. గమనించిన సమీప రైతులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం ఆయన మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గడ్డమల్లయ్యగూడలో హిమాచల్‌ప్రదేశ్ బృందం పర్యటన



నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న హిమాచల్‌ప్రదేశ్ ప్రజాప్రతినిధులు, అధికారులు

యాచారం: మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని కార్సోగ్ బ్లాక్ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం పర్యటించింది. గ్రామీణ ప్రాంతంలో అమలు చేస్తున్న నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, కంపోస్టు, క్రిమిటోరియం, పర్యావరణ స్థిరత్వం, స్వయం అభివృద్ధి, మహిళా సంఘాల పాత్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో మహిళలు ఆర్థిక ప్రగతికి కల్పిస్తున్న చిరు వ్యాపారాలు, రైతుల వ్యవసాయ స్థితిగతులపై అధ్యయనం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు మండల పరిషత్ పాత్ర, పాలకవర్గం, అభివృద్ధి పనులు, సమావేశాలు, తీర్మానాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, మండల పరిషత్ విధుల గురించి హిమాచల్‌ప్రదేశ్ బ్లాక్ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులకు వివరించారు. కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ కోర్స్ కోఆర్డినేటర్ శశిరేఖ, సీనియర్ కన్సల్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ నాగలక్ష్మి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం

రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

చేవెళ్ల: రోడ్డు భద్రతా నియమాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని సత్యసాయి గ్రామర్ పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వాహనాలు రోడ్డుకు ఎడమవైపునే నడపాలని, ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్‌లు వాహనాలు నడుపొద్దని సూచించారు. ఉదయం వాకింగ్‌కు జాతీయ రహదారులను ఉపయోగించవద్దని చెప్పారు. పాదచారులు జీబ్రా క్రాసింగ్ వద్దే రోడ్డు దాటాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం, ఏఎస్ఐ అశోక్, ట్రాఫిక్ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ అప్పలనాయకుడు, అధ్యాపకులు, విద్యార్థులు, బస్ డ్రైవర్లు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

ప్రైవేట్‌శక్తులకు ప్రజా సంపద

- కట్టబెడుతోన్న కేంద్ర ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంపదను ప్రైవేట్ శక్తులకు కట్టబెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతాలను ఉపయోగించుకొని బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్స్, రేషన్ కార్డులు, ధరణి సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరగబోయే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాంచందర్, కవిత, చంద్రమోహన్, జగదీశ్, జగన్, నర్సింహ, శ్యామ్‌సుందర్, సుమలత, బుగ్గరాములు, అంజయ్య, ఎల్లేష్, రుద్రకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

షాద్‌నగర్‌రూరల్: అంబులెన్స్‌లో ఓ మహిళ పండంటి బిడ్డకు జన్మించిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి షాద్‌నగర్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిబండతాండకు చెందిన గర్భిణీ సరితకు అర్ధరాత్రి సమయంలో పురిటి నొప్పులు వచ్చాయి. ఆసుపత్రికి వెళ్లేందుకు కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది సకాలంలో చేరుకొని మహిళను ఆసుపత్రికి తీసుకు వస్తున్నారు. నొప్పులు ఎక్కువగా రావడంతో మహిళ అంబులెన్స్‌లోనే ప్రసవించింది. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ ఈఎంటీ ప్రశాంత్ తెలిపారు. అనంతరం వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సమయానికి స్పందించిన అంబులెన్స్ సిబ్బంది ప్రశాంత్, అశోక్‌యాదవ్‌కు సరిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



బిడ్డను తల్లికి అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

సొంతింటి కల సాకారం చేస్తాం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ

కడ్తాల్: నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట పేదలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో తొలి విడతలో 3,500 లబ్ధిదారులను ఎంపిక చేసి అందజేస్తామన్నారు. మొదటి విడతలో సొంత స్థలంలో ఉన్న వారికి రూ.5లక్షలతో నిర్మించి ఇస్తామన్నారు. ఇందిరమ్మ మోడల్ హౌస్ నమూనా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

ఎంపీడీఓ భవన నిర్మాణ పనుల పరిశీలన

అనంతరం మండల కేంద్రంలో నిధులు లేక అసంపూర్తి నిలిచిపోయిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.అధికారులను అడిగి భవన నిర్మాణ వివరాలను తెలుసుకున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు హన్మానాయక్, బీక్యానాయక్, బీచ్యానాయక్, నరేశ్, వేణుగోపాల్, చందోజీ, రామకృష్ణ, మల్లేశ్‌గౌడ్, జవహర్‌లాల్, శేఖర్‌గౌడ్, అశోక్, లక్పతినాయక్, షాబుద్దీన్, యాదయ్య, రాజేందర్, రాజేశ్, ఇమ్రాన్, గోపి, గృహ నిర్మాణ శాఖ అధికారులు శ్రీనివాస్, సురేశ్ తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు